సాక్షి
మెదక్

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



వీడని అకాల వర్షం

మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా తయారైంది రైతుల పరిస్థితి. సరిగ్గా వారం క్రితమే వడగండ్ల బీభత్సం.. తేరుకోకముందే శుక్రవారం అకాల వర్షం కురిసింది.

IIలో

ఆక్రమిత అటవీ భూముల సర్వే

సాక్షి ఎఫెక్ట్

పాపన్నపేట(మెదక్): 'అటవీ..హాంఫట్' శీర్షికన శుక్రవారం 'సాక్షి 'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. చిత్రియాల్, నామపూర్ శివారులోని 70వ కంపార్ట్‌మెంట్ భూముల్లో సర్వేయర్ శ్రీనివాస్, ఇతర రెవెన్యూ అధికారులు ప్రాథమిక సర్వే నిర్వహించారు. తర్వాత అటవీశాఖ అధికారులతో కలిసి జాయింట్ సర్వే నిర్వహించే అవకాశం ఉంది.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువకులకు హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 3వ తేదీ నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9704446956, 9490129839 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



స్పార్కిల్ క్యాంపునకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: నేటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ గురుకుల విద్యార్థులకు సమ్మర్ స్పార్కిల్ క్యాంపు నిర్వహిస్తుందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ రమేష్, మెదక్ రీజియన్ రీజనల్ కో ఆర్డినేటర్ సంపత్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సాపూర్‌లోని గు రుకుల పాఠశాలలో బాలురకు, చేగుంటలోని గురుకుల క్రీడా పాఠశాలలో బాలికలకు వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మంచి వాతావరణంలో పిల్లలకు అవసరమైన అదనపు నైపుణ్యాలను అందించే దిశగా శిక్షణా కా ర్యక్రమాలు ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రధానాచార్యులు భిక్షమయ్య, విజయ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని టిక్యాదేవమ్మగూడెం తండాలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ఉచితంగా గ్రామాల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఎంపీడీఓ నవీన్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, మాజీ జెడ్పీటీసీ కమల పూల్‌సింగ్, సర్పంచ్ తుక్యానాయక్, వైద్యాధికారి వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

మెదక్ కలెక్టరేట్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం ఐదో రోజు కొనసాగింది. సమ్మె శిబిరాన్ని సాయంత్రం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ సందర్శించి మద్దతు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందు జనార్దన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ ఎక్కల దేవి మధు, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు సిద్ధంగా ఉంచాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

కొల్చారం(నర్సాపూర్): వర్షాకాలం నాటికి అవసరమైన మొక్కలు నాటేందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నఘనాపూర్ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్ట్ బ్లాక్ ప్లాంటేషన్‌ను సందర్శించారు. అక్కడి నుంచి సంగాయిపేట పెద్ద చెరువు వద్దకు చేరుకున్నారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో మొక్కల పెంపకం చేపట్టాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు. పనులు చేపట్టేందుకు ప్రతి ఒక్కరి సహకారం తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట కొల్చారం ఎంపీడీఓ గణేష్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ ఏఈఈ విజయ్ కుమార్, ఏపీఓ మహిపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

గిట్టుబాటు కాని ఉపాధి

- గరిష్టంగా రోజు కూలి రూ. 272
- గిట్టుబాటు మాత్రం రూ. 173 మాత్రమే
- పనులపై ఆసక్తి చూపని కూలీలు



మెదక్‌జోన్: ఉపాధి కూలి గిట్టుబాటు కావడం లేదు. జిల్లావ్యాప్తంగా 1,61,419 జాబ్‌కార్డులు ఉండగా 3,24,861 మంది కూలీలు ఉన్నారు. వారం రోజులుగా రోజుకు 43 వేల నుంచి 45 వేల మంది పనులు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ కూలి రూ. 272 కాగా ప్రస్తుతం రూ. 173 మాత్రమే గిట్టుబాటు అవుతుంది. కాగా గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు.. అంటే వేసవిలో నాలుగు నెలల పాటు కూలీలకు 20 నుంచి 30 శాతం వరకు అదనపు (వేసవిభత్యం) చెల్లించేవారు. గతేడాది వేసవి నుంచి తొలగించడంతో ప్రస్తుతం రూ. 173 మాత్రమే గిట్టుబాటు అవుతుంది. మండుటెండలో పనిచేస్తున్నా వేతనం గిట్టుబాటు కాకపోవడంతో పని చేసేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు.

- ఉపాధి హామీ పథకం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిది అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సైతం కొంత వాటా చెల్లించేది.
- అయితే 2022 నుంచి ఈ పథకం కేంద్రం పరిధిలో మాత్రమే కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో గతేడాది నుంచి కేంద్రం వేసవిభత్యం తొలగించింది.
- ఉపాధి కూలీలకు దినసరి వేతనం రూ. 272 గా నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా కూలీలకు రూ. 173 మాత్రమే గిట్టుబాటు అవుతుంది.
- గ్రామాల్లో ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులకు మొగ్గు చూపుతారు.
- ఒక్కో కుటుంబానికి 100 రోజుల పాటు పని కల్పించి వలసలు నివారించాలన్నదే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.
- అయితే గతంలో వేసవి భత్యం ఇవ్వడంతో రోజువారీ కూలీ రూ. 200 నుంచి రూ. 250 వరకు గిట్టుబాటు అయ్యేది.
- ప్రస్తుతం ఎండలు దంచికొట్టడం.. వేసవి భత్యం లేకపోవడంతో రోజువారి కూలి రూ. 173 మాత్రమే వస్తుంది.

తగ్గుతున్న కూలీల సంఖ్య

- కేంద్ర ప్రభుత్వం జాతీయ మొబైల్ పర్యవేక్షక వ్యవస్థ (ఎన్‌ఎంఎంఎస్) కింద రోజువారీగా కూలీల వివరాలు నమోదు చేయాలని నిర్దేశించింది.
- మరోవైపు కూలి డబ్బుల చెల్లింపు కోసం జాబ్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేయాలనే నిబంధన తెచ్చారు.
- చాలా మంది ఆధార్ కార్డుల్లో తప్పులు దొర్లటం, బ్యాంకు ఖాతాలు లేకపోవడం వంటి కారణాలతో కూలి చెల్లింపులో జాప్యం జరుగుతుంది.
- ఈ సమస్యతో పాటు కూలి గిట్టుబాటు కాకపోవడం కూడా కూలీల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణమని పలువురు చర్చించుకుంటున్నారు.
- అయితే ప్రధానంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువులు, కుంటల్లో పూడిక తీత, కాలువలు తవ్వడం, మట్టి రోడ్లు పోయడం వంటి పనులు చేపడుతున్నారు.
- అలాగే మొక్కల సంరక్షణ, నర్సరీల నిర్వహణ, తదితర పనులను ఈ పథకం కిందే చేపడుతున్నారు. వీటి అమలుకు కూలీల వినియోగం ఎక్కువగానే ఉంటుంది.

మెజర్‌మెంట్ ప్రకారం కూలి



కూలీలు పనిచేసిన దానిని బట్టి కూలి గిట్టుబాటు అవుతుంది. పని ఎక్కువగా చేస్తే కూలి ఎక్కువగానే వస్తుంది. ప్రతి కుటుంబానికి వంద రోజుల పాటు పని కల్పిస్తాం.

– శ్రీనివాస్, డీఆర్‌డీఓ

'కంటి వెలుగు'పై నిర్లక్ష్యం వహించొద్దు

కలెక్టర్ రాజర్షిషా



ఎల్లాపూర్ కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

పాపన్నపేట(మెదక్): కంటి వెలుగు శిబిరాల్లో నిర్లక్ష్యం పనికిరాదని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాల్లో సరిపడా అద్దాలు, పరీక్ష పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. అవసరం ఉన్నవారికి అద్దాలు ఇవ్వాలని, ఆపరేషన్లు అవసరమైతే ఇతర ఆస్పత్రులకు సిఫారసు చేయాలని ఆదేశించారు. శిబిరాలు ప్రారంభించి 60 రోజుల పూర్తి కాగా.. ఇప్పటివరకు 332 పంచాయతీల్లోని 57 వార్డుల్లో 3.30 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. 26 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపల్ వార్డుల్లో ప్రస్తుతం కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయని వివరించారు. అనంతరం ఎల్లాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ట్యాబ్ ఎంట్రీ వెంట వెంటనే చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనిల, వైద్యులు దీక్ష, నవీన్, అడిషనల్ పీడీ భీమయ్య, తహసీల్దార్ మహేందర్, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో జెండా ఎగరేయాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: పార్టీ ప్లీనరీ సందర్భంగా ఈనెల 25వ తేదీన నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉదయం పది గంటలకు పార్టీ జెండా ఎగురవేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆదేశాల మేరకు ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. నర్సాపూర్‌లో జరిగే నియోజకవర్గ స్థాయి ప్లీనరీకి తరలిరావాలని కోరారు. అనంతరం ముస్లింలకు ఇచ్చిన హామీ మేరకు నర్సాపూర్‌లో ఖబరస్తాన్ కోసం ఐదెకరాల భూమిని కేటాయించినట్టు చెప్పారు. చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు రూ. 20 లక్షలు మంజూరు చేసినట్లు ప్రకటించారు. శివ్వంపేట మండలంలోని దొంతి నుంచి దంతాన్‌పల్లి వరకు రోడ్డు విస్తరణ కోసం రూ. 18 కోట్లు.. అదే మండలంలోని చండి నుంచి గోమారం మీదుగా కానుకుంట ఎక్స్ రోడ్డు వరకు రూ. 20 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి మరో నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేయించినట్లు వివరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గొర్రెల పంపిణీ



మాట్లాడుతున్న జేడీ విజయశేఖర్‌రెడ్డి

టేక్మాల్(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ గొర్రెలను పంపిణీ చేస్తుందని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ విజయశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం టేక్మాల్ రైతు వేదికలో లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. మండలంలో రెండో విడత గొర్రెల పంపిణీలో 414 మంది లబ్ధిదారులకు గానూ 118 మంది డీడీలు చెల్లించినట్టు చెప్పారు. అధికారుల సూచనల మేరకు డబ్బులు చెల్లించి గొర్రెలను తీసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఆధార్‌కార్డు, కుల ధృవీకరణ పత్రం, బ్యాంక్ పాసుబుక్ అధికారులకు ఇవ్వాలన్నారు. లబ్ధిదారుడి వాటా కింద రూ.43,750 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ జెమ్లా నాయక్, ఎంపీపీ చింతా స్వప్న రవి, తహసీల్దార్ హర్దీప్‌సింగ్, ఎంపీడీఓ భారతి, పశువైద్యాధికారి రమేష్, సర్పంచ్ సుప్రజ, ఎంపీటీసీ నిమ్మ వాణి, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

వీక్లీ పరేడ్‌తో ఫిజికల్ ఫిట్‌నెస్

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్‌మున్సిపాలిటీ/మనోహరాబాద్(తూప్రాన్): వీక్లీ పరేడ్‌తో సిబ్బందికి ఫిజికల్ ఫిట్‌నెస్ లభిస్తుందని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం జిల్లా నూతన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమయం దొరికినప్పుడు సిబ్బంది, అధికారులు వ్యాయామం చేయాలని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి పోలీస్ శాఖకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వ్యక్తిగత, ఆరోగ్య సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు, సైదులు, యాదగిరిరెడ్డి, ఆర్ఐ అచ్యుతరావు, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు.

అంధకారంలో మెదక్

మెదక్ జోన్: జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ నిలిచిపోయి పలు మండలాల్లో శుక్రవారం రాత్రి అంధకారం అలుముకుంది. ఈదురుగాలులకు చిన్నశంకరంపేట, వెల్దుర్తి తూప్రాన్, మెదక్ హవేలీ ఘనపూర్, మనోహరాబాద్, తదితర మండలాల్లో సుమారు రెండు గంటలకుపైగా విద్యుత్ నిలిచిపోయింది. పలు మండలాల్లో ఈదురు గాలులతో మామిడికాయలు రాలిపోయాయి. కోతకు వచ్చిన వరి నేలవాలగా.. ఇప్పటికే రోడ్ల వెంట ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

మెదక్‌జోన్: పేపర్ లీకేజీకి కారణమై లక్షలాది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడిన టీఎస్‌పీఎస్సీని వెంటనే ప్రక్షాళన చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశికాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏబీవీపీ నాయకులతో కలిసి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేపర్ లీకేజీ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సిట్ విచారణ నివేదికను విడుదల చేయాలని కోరారు. పేపర్ లీకేజీ వెనుక ఉన్న ప్రభుత్వ పెద్దలను బయటపెట్టి కఠినంగా శిక్షించాలని.. లేకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జేపీఎస్‌ల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా



ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్ రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ విషయం సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని సీఎం రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుచన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్సీని కలిసి వినతి పత్రం అందించారు. గ్రామ పంచాయతీలకు జాతీయ అవార్డులు రావడంలో తమ పాత్ర ఉందని విన్నవించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల కష్ట నష్టాలను ప్రభుత్వం గుర్తించిందని, అందుకే రెండున్నర ఏళ్లకే పే స్కేల్‌తో సమానమైన వేతనం అందిస్తుందని అన్నారు. ఉద్యోగులకు కడుపునిండా జీతాలు ఇస్తున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని, వైకుంఠధామాల చుట్టూ వచ్చే హరితహారంలో బయో ఫెన్సింగ్ చేసే విధంగా కార్యదర్శులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాసాయిపేట కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీశైలం, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'సదరం' క్యాంపు షెడ్యూల్ విడుదల

మెదక్ కలెక్టరేట్: ఏప్రిల్, మే నెలలో నిర్వహించనున్న సదరం క్యాంపు తేదీలను మీసేవ, ఈ–సేవ కేంద్రాలకు కేటాయించినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే వైద్య పరీక్షలకు హాజరయ్యే దివ్యాంగులు సమీపంలోని మీ–సేవ, ఈ–సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. వారు ఇచ్చిన రసీదులో కేటాయింపబడిన తేదీలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హాజరు కావాలన్నారు. శిబిరానికి వచ్చే అభ్యర్థులు మీ సేవ రసీదు, ఆధార్ జిరాక్స్, ఫొటో, సంబంధిత మెడికల్ రిపోర్టులు వెంట తెచ్చుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని వారు శిబిరానికి రావాల్సిన అవసరం లేదని చెప్పారు.

గరుడ గంగ పుష్కరాలకు వేళాయే


నేడు ప్రారంభించనున్న మాధవానంద సరస్వతి



ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



ఆలయ ప్రధాన ద్వారం



మంజీరా నది

మెదక్ రూరల్: గరుడ గంగ మంజీరా నది పుష్కరాలు 12 ఏళ్ల తర్వాత రెండోసారి వైభవోపేతంగా జరగబోతున్నాయి. నేటి నుంచి మే 3వ తేదీ వరకు కొనసాగనున్న పుష్కరాలను రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి లాంఛనంగా ప్రారంభించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

జిల్లాలోని పేరూరు శివారులో గరుడ గంగ మంజీరా నది తీరాన ఉన్న సరస్వతీ ఆలయం వద్ద పుష్కరాలు నిర్వహించనున్నారు. 2011 మే 8న తొలిసారి జరిగిన పుష్కరాలను అప్పట్లో ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. సరిగ్గా 12 ఏళ్ల తర్వాత తిరిగి పుష్కరాలు జరగనున్నాయి. రోజుకో దానం చొప్పున 12 రోజుల పాటు కొనసాగనున్నాయి. సరస్వతీ అమ్మవారితో పాటు పుష్కరదేవతకు అభిషేకం, 108 హోమ గుండాల్లో యాగం, మంజునాథస్వామికి అభిషేకం, సప్త గంగహారతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

పుష్కరాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సరస్వతీ దేవాలయ వ్యవస్థాపకులు రాజమౌళి శర్మ, ఆలయ ప్రధాన పూజారి మహేష్ శర్మ తెలిపారు. ఆలయం వెనుక నదిలోకి వెళ్లేందుకు వీలుగా మెట్ల మార్గం ఏర్పాటు చేశారు. నదిలో స్నానం ఆచరించే అవకాశం లేని వారి కోసం ట్యాప్‌ల ద్వారా స్నానం చేసే వెసులుబాటు కల్పించారు. 15 స్నానపు గదులు, మూత్రశాలలను నిర్మించారు.

12 రోజుల పాటు పుష్కరాలు

గరుడ గంగ పుష్కరాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. లక్షల సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ప్రత్యేక గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. పుష్కరాలు పూర్తయ్యేవరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తాం.

– రాజమౌళి శర్మ, సరస్వతీ దేవాలయ వ్యవస్థాపకులు

క్లుప్తంగా

భర్తతో గొడవపడి భార్య అదృశ్యం

పటాన్‌చెరు టౌన్‌: భర్తతో గొడవపడి భార్య అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కిష్టారెడ్డి చెప్పిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్‌ పరిధిలోని బీరంగూడలో నివాసం ఉంటున్న బస్వరాజ్‌ భార్య శశికళ ఇద్దరు గొడవపడ్డారు. దీంతో ఆమె గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి అదృశ్యంపై కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బిట్‌ కాయిన్‌ కోసం ఆరా మోసపోయిన మహిళ

రూ.1,20,000లు పోగొట్టుకున్న బాధితురాలు

సిద్దిపేటకమాన్‌: బిట్‌ కాయిన్‌ కోసం ఓ మహిళ ఆన్‌లైన్‌లో సైబర్‌ మోసానికి గురైన సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట సీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన ఓ మహిళ గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి బిట్‌ కాయిన్‌ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్‌ చేసింది. అందులో ఉన్న ఫోన్‌ నెంబర్‌కు ఫోన్‌ చేసింది. గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన మాయమాటల్లో పడి బాధితురాలు ఆన్‌లైన్‌లో రూ.1,20,000లు పంపించింది. అనంతరం ఆ నెంబర్‌కు ఫోన్‌ చేయగా స్విచ్‌ ఆఫ్‌ రావడంతో సైబర్‌ మోసం జరిగినట్లు గుర్తించింది. వెంటనే బాధితురాలు జాతీయ హెల్ప్‌లైన్‌ నెంబర్‌ 1930కు ఫిర్యాదు చేసింది.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్‌: మండలంలోని మాడ్గి గ్రామానికి చెందిన రాంచందర్‌(55) కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ కాశీనాథ్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..గురువారం రాత్రి 10.30కు రాంచందర్‌ భార్యతో గొడవపడ్డాడు. అనంతరం జీవితంపై విరక్తి చెంది చున్నీతో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దింపారు. గ్రామస్థుల సహాయంతో జహీరాబాద్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుడు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపాడు. కుమారుడు జీవన్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూరిగుడిసె దగ్ధం

నర్సాపూర్‌ రూరల్‌: మండలంలోని తుజాల్‌పూర్‌లో పూరి గుడిసె దగ్ధమైంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పన్యాల శేఖర్‌ తన భార్య పిల్లలతో పూరిగుడిసెలో నివాసం ఉంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పూరి గుడిసెకు నిప్పు అంటుకుంది. ఈ ప్రమాదంలో గుడిసెలోని నిత్యావసర సరుకులతో పాటు, వంట సామగ్రి, బట్టలు, రూ.8,500లు కాలి బూడిదయ్యాయి. ఇంటికి నిప్పు అంటుకున్న సమయంలో శేఖర్‌తో పాటు అతని భార్య పద్మ పిల్లలు సాధిక, సుప్రియ, సుశాంత్‌, చరణ్‌ నిద్రలో ఉన్నారు. శేఖర్‌, పద్మలు అప్రమత్తమై వెంటనే బయటకు పరుగులు తీశారు. మంటలు ఆర్పేందుకు గ్రామస్తులు శ్రమించినప్పటికీ అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోయింది. శేఖర్‌ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వీడని అకాల వర్షం..

- గాలి దుమారంతో వాన
- పంటలకు నష్టం
- వరిచేలల్లో రాలిన గింజలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ఆందోళనలో రైతులు



దుబ్బాకలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం



చెల్లాపూర్‌లో గాలివానకు కూలిన పశువుల కొట్టం

దుబ్బాకటౌన్‌: మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుగా తయారైంది రైతుల పరిస్థితి. సరిగ్గా వారం క్రితమే వడగండ్ల బీభత్సం. ఆ షాక్‌ నుంచి ఇంకా తేరుకోకముందే అకాల వర్షం. శుక్రవారం తెల్లవారుజామున గాలిదుమారంతో వాన పడడంతో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో రైతులకు పుండు మీద కారం చల్లినట్లుగా తయారైంది వారి పరిస్థితి. గురువారం అర్ధరాత్రి నుంచే ఉరుములు..మెరుపులతో కూడిన గాలి దుమారం.

మధ్యరాత్రి 3 గంటలకు వాన పడింది. విపరీతంగా గాలిదుమారంతో వానపడడంతో కోతకొచ్చిన వరిచేలల్లో గింజలు రాలి పంటలకు నష్టం వాటిల్లింది. దుబ్బాకతో పాటు చెల్లాపూర్‌, మల్లాయపల్లి, బల్వంతాపూర్‌, పద్మశాలిగడ్డ, చీకోడ్‌, కమ్మరపల్లి, రాజక్కపేట, చేర్వాపూర్‌, లచ్చపేట ధర్మాజీపేట, రామక్కపేట గ్రామాల్లో గాలివానతో పంటలకు తీవ్ర నష్టం కలిగింది. ఇప్పటికే గత వారం రోజుల క్రితం వడగండ్ల వాన చెల్లాపూర్‌, మల్లాయపల్లి, బల్వంతాపూర్‌, పద్మశాలిగడ్డ గ్రామాలతో పాటు దుబ్బాక పట్టణంలో వరిపంటలు 90 శాతంకు పైగా నష్టం వాటిల్లింది.

కుప్పల్లో చేరిన నీరు

అకాల వర్షంతో దుబ్బాక మార్కెట్‌ యార్డుతో పాటు చెల్లాపూర్‌లో వరికోసి ఆరబెట్టేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద పోసిన ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాని ఆరబెట్టేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కుప్పల క్రింది నుంచి నీళ్ల పోవడంతో ధాన్యాన్ని మళ్లీ వేరేచోటకు రైతులు ఎత్తిపోయాల్సిన పరిస్థితి దాపురించింది. కోసిన ధాన్యం అకాల వర్షంతో తడిసి ముద్దవ్వగా, వరికోతలు సాగని పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు వెంటాడుతున్న అకాల వర్షం..మరోవైపు పంట చేతికొస్తుందో రాదోనని రైతులు అయోమయం చెందుతున్నారు. గాలివానకు చెల్లాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఇండ్ల రేకులు, పశువుల షెడ్లు సైతం ధ్వంసం అయ్యాయి.

ఆరబెట్టిన ధాన్యం తడిసింది



రెండు రోజుల క్రిందటనే 8 ఎకరాల్లో వరిపంట కోసి మార్కెట్‌లో పోసిన. అర్ధరాత్రి తరువాత ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో గాలివాన పడడంతో మార్కెట్‌లో పోసినధాన్యం తడిసింది. ఎండబోసిన ,వడ్లు కూడా తడిశాయి. నా కుప్పల క్రింద నుంచి నీళ్లు పోయినయి.

–కేసుగారి స్వామి, రైతు, దుబ్బాక

అస్థికలు కలిపేందుకు వెళుతుండగా..



బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ పగిల్ల ఎల్లయ్య



ప్రమాద బాధితులకు చికిత్స అందిస్తున్న దృశ్యాలు

- జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదం
- డ్రైవర్‌ మృతి.. 25 మందికి తీవ్రగాయాలు
- 15 మంది పరిస్థితి విషమం

వెల్గటూర్‌, గజ్వేల్‌: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ప్రైవేట్‌ బస్సు డ్రైవర్‌ పగిల్ల మల్లయ్య(50) దుర్మరణం చెందగా, మరో 25మందికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో 15మంది పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌ మండలం బెజుగామ గ్రామానికి చెందిన ఆకుల దేవేందర్‌ తల్లి ఆకుల అనసూయ ఇటీవల మరణించింది. ఆమె అస్థికలు జగిత్యాల జిల్లా ధర్మపురి గోదావరి నదిలో కలపడానికి ప్రైవేట్‌ బస్సులో శుక్రవారం ఉదయం బయలు దేరారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన 25 మంది ఉన్నారు. బస్సు కొత్తపేట గ్రామం వద్దకు చేరింది. అక్కడ రోడ్డుపై పడిఉన్న చెట్టును తప్పించబోయింది. అదేసమయంలో రాయపట్నం నుంచి కరీంనగర్‌ వైపు వెళ్తున్న లారీ వేగంగా రావడంతో బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌ పగిల్ల ఎల్లయ్య క్యాబిన్‌లో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఒకేకుటుంబానికి చెందిన ఆకుల మంగమ్మ, మౌనిక, శ్రీనివాస్‌, వెంకటేశం, యాదగిరి, నాగలక్ష్మి, విజయలక్ష్మి, దినేశ్‌, భాగ్యలక్ష్మి, సుభద్ర, అక్షర, మయాన్షి, మానస, కనకయ్య సహా సుమారు 25 మంది గాయపడ్డారు. 15 మంది కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు. బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ పగిల్ల ఎల్లయ్యను జేసీబీ సాయంతో శ్రమించి బయటకు తీశారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. గాయపడ్డ మిగతావారిని కరీంనగర్‌, జగిత్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వారిలో 15మంది పరిస్థితి విషమంగా ఉంది.

చెట్టుకొమ్మను తప్పించబోయి..

వెల్గటూర్‌, ఎండపల్లి మండలాల్లో గురువారం రాత్రి బలమైన ఈదురుగాలులు వీచాయి. వీటిధాటికి చెట్టుకొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. సాయంత్రం వరకూ వాటిని ఎవరూ తొలగించలేదు. అయితే, ఈ చెట్టుకొమ్మలను తప్పించే ప్రయత్నంలో బస్సు డ్రైవర్‌ అదుపుతప్పి లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరో 15కిలోమీటర్ల దూరంలో ధర్మపురికి చేరుకునేలోపే రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటన బెజుగామ గ్రామంతో పాటు గజ్వేల్‌ పట్టణంలో విషాదాన్ని నింపింది.

భర్త ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్‌): భార్య పుట్టింటి నుంచి రావడంలేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చందాయిపేటలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన అవబోతు గణేశ్‌(30)కు అదే గ్రామానికి చెందిన సౌజన్యతో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. నాలుగు నెలల క్రితం సౌజన్యకు శస్త్ర చికిత్స చేయించగా అదే గ్రామంలోని తన పుట్టింట్లో ఉంటుంది. గణేశ్‌ సౌజన్యను తమ ఇంటికి రావాలని ఇటీవల భార్యతో గొడవ పడుతుండేవాడు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోక పోవడంతో మద్యం సేవించి ఓ తోటలో ఉరి వేసుకొని మృతి చెందాడు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సదాశివపేట రూరల్‌ (సంగారెడ్డి): నందికంది జాతీయ రహదారిపై లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు చిన్నారులు గురువారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ ప్రమాద స్థలాన్ని శుక్రవారం సంగారెడ్డి డీఎస్పీ రవీంద్ర రెడ్డి పరిశీలించారు. ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన అండర్‌ పాస్‌ నిర్మాణాన్ని చేపట్టాలని సర్పంచ్‌ రాజు, ఉప సర్పంచ్‌ సునీల్‌ అధికారులకు విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. వేగంగా వెళ్తున్న వాహనాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తగిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ నవీన్‌ కుమార్‌, ఎల్‌ అండ్‌ టి అధికారులు పాల్గొన్నారు.

చిన్నారి రిహన్‌ అంత్యక్రియలు పూర్తి

గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి రిహన్‌(12) అంత్యక్రియలను శుక్రవారం నిర్వహించారు. మరో చిన్నారి సక్లయిన్‌(8) మృతదేహాన్ని బీహార్‌లోని వారి స్వగ్రామానికి అంబులెన్స్‌లో తరలించారు.

నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశానికి ప్రమాదం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఎ రహమాన్‌

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అదానీ, అంబానీ లకు కట్టబెడుతూ, మతరాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వం దేశానికి ప్రమాదకరమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ రహమాన్‌, పట్టణ కార్యదర్శి వి. వినోద పేర్కొన్నారు. బీజేపీ హటావో దేశ్‌ కో బచావో నినాదంతో సీపీఐ కేంద్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటులో ప్రభుత్వానికి వ్యతిరేఖంగా మాట్లాడిన వారిపై సీబీఐ, ఈడీ దాడులతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, నిరుద్యోగం బాగా పెరిగిపోయిందని అన్ని రంగాల్లో దేశం వెనక్కి నెట్టబడిందన్నారు. ఈ కార్యక్రమంలో తాజుద్దీన్‌, ముస్తాఫా, ఎం .రమేశ్‌, సాదిక్‌అలి, దత్తుస్వామి, రాజు, యాకుబ్‌అలి, పూలమ్మ, లక్ష్మి, అనసుజా తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి



పేకాట స్థావరం నుంచి స్వాధీనం చేసుకున్న బైకులు



నగదు, సెల్‌ ఫోన్లు

- 6 బైకులు, 6 సెల్‌ ఫోన్లు, రూ.33,700లు స్వాధీనం
- ఆరుగురిపై కేసు నమోదు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న స్థావరంపై శుక్రవారం టాస్క్‌ ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ నరేశ్‌ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 6 బైక్‌లు, ఆరు సెల్‌ ఫోన్లతో పాటు, రూ.33,700లు స్వాధీనం చేసుకున్నారు. ఒకరు పరారీలో ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్‌ఐ గంగరాజు తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాలు, ఇండ్లు, ఫాంహౌస్‌ల్లో పేకాట, జూదం ఆడినా, మరే ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని టాస్క్‌ ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ నరేశ్‌ హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడినట్లు గమనిస్తే డయల్‌ 100 లేదా, సిద్దిపేట పోలీస్‌ కమిషనరేట్‌ కంట్రోల్‌ రూం నెంబర్‌ 8712667100కు సమాచారం అందించాలని కోరారు. పేకాట, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

పశువులపై చిరుత దాడి

లేగ దూడ మృతి



మృతి చెందిన లేగ దూడ

కల్హేర్‌(నారాయణఖేడ్‌): పశువులపై చిరుత దాడి చేసిన ఘటనలో లేగ దూడ మృతి చెందిన ఘటన రాపర్తి శివారులో జరిగింది. స్థానికులు, ఉరటి సాయిలు (రైతు) చెప్పిన వివరాల ప్రకారం..గురువారం రాత్రి మండలంలోని రాపర్తి శివారులో చిరుత పులి ప్రత్యక్షమైంది. ఉరటి సాయిలుకు చెందిన పశువులపై చిరుత పులి దాడి చేసింది. ఈ ఘటనలో లేగదూడ హతమైనట్లు ఆయన పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్‌ శ్రావణ్‌కుమార్‌, అటవీ శాఖ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత కొంత కాలంగా అటవీ ప్రాంతాంలో చిరుత పులి సంచరిస్తుండడంతో కల్హేర్‌, సిర్గాపూర్‌ మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కడ్పల్‌ శివారులో అడవిలో కెమెరాలు ఏర్పాటు చేయడంతో అప్పట్లో చిరుత పులి తిరుగుతున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. దీంతో అక్కడ చిరుత పులి ఉందనే విషయన్ని అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. కడ్పల్‌, ఖాజపూర్‌, ఖానాపూర్‌(కె), నాగధర్‌, రాపర్తి, కృష్ణాపూర్‌, సంజీవన్‌రావుపేట చుట్టూ అటవి ప్రదేశం ఉండడంతో చిరుత సంచరిస్తుంది. ఈ క్రమంలో స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని, తమతో పాటు పశువులకు రక్షణ కల్పించాలని వారు అటవీ అధికారులను కోరుతున్నారు. నష్టపోయిన సాయిలును ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన వేడుకొంటున్నాడు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో ఒకరు, పురుగుల మందు తాగి ఇంకొకరు మృతి చెందారు.



బాల్‌రెడ్డి (ఫైల్‌)

దుబ్బాక: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతున్న..వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం దౌల్తాబాద్‌ ఎస్‌ఐ చైతన్య రెడ్డి వివరాల ప్రకారం..రాయపోల్‌ మండలం తిమ్మక్కపల్లికి చెందిన కర్ణంపల్లి బాల్‌రెడ్డి(45) ఈ నెల 14వ తేదీన పని నిమిత్తం దుబ్బాక నుంచి తిరిగి వెళ్తున్న క్రమంలో బైక్‌ను వేగంగా నడపడంతో దొమ్మాట గ్రామ శివారులో రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాల్‌రెడ్డిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాల్‌రెడ్డి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు దశ్మంత్‌ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చేర్యాల(సిద్దిపేట): పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కడవేర్గు గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆరుట్ల ప్రసాద్‌(33) ప్రైవేటు జాబ్‌ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొద్దిరోజులుగా మద్యానికి బానిసైన ప్రసాద్‌ ఈ నెల 16వ తేదీ రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చిన అనంతరం భార్య రమ్యతో గొడవపడ్డాడు. విషయం తెలుసుకొని తల్లిదండ్రులు మందలించారు. మద్యం మత్తులో ఉన్న ప్రసాద్‌ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్సనిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం నిర్వహిస్తుండగా శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



వృద్ధుడి మృతదేహం

రామాయంపేట(మెదక్‌): అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని 60ఏళ్ల వృద్ధుని మృతదేహం శుక్రవారం రైల్వే పోలీసులకు లభ్యమైంది. కామారెడ్డి రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ జశ్వంత్‌సింగ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలిని ఆయన సందర్శించారు. అక్కడ ఒకటో నెంబర్‌ ప్లాట్‌ఫాంపై వృద్ధుడి మృతదేహాన్ని చూశారు. గుర్తు తెలియని వృద్ధుడిగా కేసు నమోదు చేసినట్టు రైల్వే కానిస్టేబుల్‌ జశ్వంత్‌సింగ్‌ తెలిపారు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి..



సత్తయ్య మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్‌): చేపలవేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌ వివరాల ప్రకారం..శుక్రవారం మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన తలారి సత్తయ్య(56) గ్రామశివారులోని చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వల కాళ్లకు చుట్టుకొని ఈత కొట్టలేక ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. రోజూ మాదిరిగానే తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లి తెల్లారేసరికి ఇంటికి వచ్చే భర్త ఎంతకూ రాకపోవడంతో అతని భార్య లక్ష్మి, అల్లుడు రవి చెరువు వద్దకు వెళ్లి చూశారు. అక్కడ చెరువులో చేపలవలకు చుట్టుకొని నీటిలో మునిగి ఉన్నట్టు కన్పించాడు. వెంటనే చెరువులోకి వెళ్లి సత్తయ్యను రక్షించేందుకు ప్రయత్నించగా అతను అప్పటికే చనిపోయినట్లు గ్రహించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్‌ తెలిపారు.

కారు ఢీ కొని లారీ డ్రైవర్‌..



ఒర్సు మల్లేశ్‌ (ఫైల్‌)

కొండపాక(గజ్వేల్‌): కారు ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్‌ ఒర్సు మల్లేష్‌(46) అక్కడిక్కడే మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్‌ తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌ నుంచి కరీంనగర్‌ వైపునకులారీ నడుపుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో డ్రైవరు టీ తాగేందుకు తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో ఓ హోటల్‌ వద్ద లారీనీ నిలిపి అవతలి వైపునకు వెళ్లాడు. తిరిగి లారీ వద్దకు వస్తూ డీవైడర్‌ను దాటుతున్న క్రమంలో హైదరాబాద్‌ నుంచి సిద్దిపేట వైపునకు వెలుతున్న కారు డీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవరు దినేష్‌కు సల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటా హుటీన సంఘటనా స్థలానికి చేరుకొని కారు డ్రైవరును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవరు దినేష్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పుష్పరాజ్‌ తెలిపారు.

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న చక్రధర్‌గౌడ్‌

సిద్దిపేటకమాన్‌: సిద్దిపేట పట్టణంలోని ఫార్మర్స్‌ ఫస్ట్‌ ఫౌండేషన్‌ కార్యాలయంపై దాడికి యత్నించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని పౌండేషన్‌ అధ్యక్షుడు చక్రధర్‌గౌడ్‌ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ఫార్మర్స్‌ ఫస్ట్‌ పౌండేషన్‌ కార్యాలయ వాచ్‌మెన్‌పై గురువారం రాత్రి గుర్తు తెలియని ఐదుగురు వ్యక్తులు దాడికి యత్నించారని ఆరోపించారు. కార్యాలయంకు నిప్పు పెట్టి కాలుస్తామని బెదిరించినట్లు వారు తెలిపారు. కౌలు రైతుల కోసం ఏర్పాటు చేసిన వాహనంపై గుర్తు తెలియని వ్యక్తులు మూత్ర విసర్జన చేశారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని వారో కోరారు. తమకు, కార్యాలయానికి పోలీసులు భద్రత కల్పించాలన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై టూ టౌన్‌ పోలీస్‌ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ సమావేశంలో కస్తూరి హరీశ్‌, ప్రవీణ్‌, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్‌: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్‌ కమిషనర్‌ ఎన్‌.శ్వేత సిబ్బందికి సూచించారు. వివిధ పోలీస్‌ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సెక్షన్‌ ఇన్‌చార్జి, బ్లూకోల్ట్స్‌, పెట్రోకార్‌ సిబ్బందికి ఎమర్జెన్సీ కమ్యూనికేషన్‌ ప్లాన్‌, కమ్యూనికేషన్‌ వ్యవస్థ గురించి సీపీ కార్యాలయంలో శుక్రవారం వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పోలీస్‌ స్టేషన్‌కు రాత్రి సమయాల్లో ఏదైనా ముఖ్యమైన ఫోన్‌ కాల్‌ వస్తే సంబంధిత సెక్షన్‌ ఇన్‌చార్జి ఉన్నతాధికారులకు, ఎస్‌బి కంట్రోల్‌ రూం, పోలీసు కంట్రోల్‌ రూంకు తెలియపర్చాలన్నారు. అన్ని పోలీస్‌ స్టేషన్లకు నూతన మొబైల్‌ ఫోన్లు, నూతన నెంబర్లు ఇచ్చారన్నారు. వాటిని సెక్షన్‌ ఇన్‌చార్జి దగ్గర మాత్రమే ఉంచాలని తెలిపారు. విధినిర్వహణలో ఉన్న అధికారుల వద్ద మాత్రమే ఈ ఫోన్‌ ఉండాలని సీపీ సూచించారు. రాత్రి సమయాల్లో విహెచ్‌ఎఫ్‌ సెట్‌, మొబైల్‌ ఫోన్‌లో ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సెక్షన్‌ ఇన్‌చార్జి కంట్రోల్‌ రూమ్‌ నుంచి విహెచ్‌ఎఫ్‌ సెట్‌, ఫోన్‌లో కానీ స్పందించకపోతే కంట్రోల్‌ రూంలో ఉండే సిబ్బంది వెంటనే అధికారులకు తెలపాలని సూచించారు. డయల్‌ 100కాల్‌ సెక్షన్‌ ఇన్‌చార్జికి రాగానే సంబంధిత బ్లూ కోల్ట్‌, పెట్రోకార్‌ సిబ్బందికి సమాచారం చేరవేయాలన్నారు. ఐదు నుంచి పది నిమిషాల్లోపే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. కమ్యూనికేషన్‌ వ్యవస్థపై సీసీఆర్‌బి అధికారి చంద్రశేఖర్‌ పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. సమావేశంలో అడిషనల్‌ డీసీపీ అడ్మిన్‌ మహేందర్‌, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.